

లడ్డూ కావాలా నాయనా!

● ఇళ్లకే తీసుకెళ్లి ఇస్తున్న కొంతమంది టీటీడీ సిబ్బంది
● భక్తుల విస్మయం!



చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూను భక్తులకు అందుబాటులో వుంచేందుకు పాలకులు మార్గాలు అన్వేషిస్తుంటే.. ఈ లడ్డూలను మరోవిధంగా ఖరీదైన భక్తుల చెంతకు చేర్చేందుకు కొంతమంది టీటీడీ సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో టి.నగర్ వెంకటనారాయణరోడ్డులో వెంకటేశ్వరస్వామి ఆలయం ఉన్న విషయం తెలిసిందే. తిరుమల తరహాలోనే ఇక్కడా ఆలయ ప్రాంగణంలోనే లడ్డూలను విక్రయిస్తుంటారు. అయితే గత కొంతకాలంగా వారానికి రెండుసార్లు తిరుమల నుంచి లడ్డూలు వస్తుండడంతో భక్తులకు విరివిగా లభ్యమవుతున్నాయి. కొన్నిసార్లు అవసరానికి మించి లడ్డూలు వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొంతమంది ఆలయ సిబ్బంది లడ్డూలను ధనికులైన భక్తుల నివాసాలకు తీసుకెళ్లి ఇస్తున్నట్లు సమాచారం. స్వామివారి ప్రసాదాన్ని అందించి, వారి నుంచి తమకు 'కావాల్సిన'వి పొందుతున్నట్లు తెలిసింది. ఇటీవలి కాలంలో ఈ 'ప్రసాద వితరణ' మరీ ఎక్కువైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిని అరికట్టాలని పలువురు భక్తులు కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే టీటీడీ విజిలెన్స్‌కు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. రెండు వారాల క్రితం ఇక్కడకు తనిఖీకి వచ్చిన విజిలెన్స్ అధికారులకు సైతం ఫిర్యాదులందాయి. దీనిపై విజిలెన్స్ అధికారులు సైతం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ ఆరోపణలు నిజమని తేలడంతో విజిలెన్స్ అధికారులు నివేదికను రూపొందించినట్లు సమాచారం. దీనిపై త్వరలోనే చర్యలుంటాయని టీటీడీ వర్గాలు తెలిపాయి. కాగా ఇద్దరు ఉద్యోగులు సుదీర్ఘకాలంగా చెన్నై ఆలయంలోనే పని చేయడం పట్ల కూడా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులందినట్లు తెలిసింది.

కస్తూరీ... తెలుగుజాతి చరిత్ర తెలుసా ?

● నటి వ్యాఖ్యలపై తెలుగు నేతల ఆగ్రహం ● తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్



తమిళనాడులోని తెలుగు ప్రజల గురించి సినీ నటి కస్తూరి చేసిన వ్యాఖ్యలు పెనుదుమారం రేపాయి. తరాలుగా ఈ నేలమీద ఉన్న తెలుగుప్రజలను ఆమె అవమానించారంటూ ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు ప్రజల గురించి మాట్లాడేముందు వారి చరిత్ర గురించి తెలుసుకోవాలని పలువురు నేతలు హితవు పలికారు.

కస్తూరి వ్యాఖ్యల వివాదం సోమవారం టీవీ ఛానెళ్లలో హోరెత్తింది. సోషల్ మీడియాలో వాదవివాదాలు వైరల్‌గా మారాయి. తన వ్యాఖ్యలను నటి కస్తూరి తక్షణం ఉపసంహరించుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అడయార్

కాలగర్భంలో కలిసిపోయారు



కేతిరెడ్డి జగదీశ్వర రెడ్డి

తమిళనాడు రాష్ట్రంలోని తెలుగు ప్రజల్ని కించపరిచేలా మాట్లాడినవారంతా కాలగర్భంలో కలిసిపోయారని, ఈ విషయాన్ని సినీ నటి కస్తూరికి తెలియకపోవచ్చని తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సినీ నిర్మాతల మండలి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర రెడ్డి పేర్కొన్నారు. తెలుగు ప్రజల గురించి నటి కస్తూరి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. కస్తూరి పరోక్షంగా దివంగత మహానేతలు తంధై పెరియార్ రామస్వామి, కలైంజర్ కరుణానిధిలను దెప్పి పొడిచారన్నారు. కొన్ని దశాబ్దాలుగా సోదరభావంతో కలిసిమెలిసి జీవిస్తున్న తెలుగు ప్రజలను కించపరిచేలా, రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసిన వారంతా కాలగర్భంలో కలిసిపోయారన్నారు. 'అన్నమయ్య' వంటి ఓ మంచి భక్తిరస చిత్రంలో నటించిన కస్తూరిని తెలుగు ప్రజలు అక్కున చేర్చుకున్నారని, అలాంటి వారు రాజకీయ అవసరాల కోసం ఇలా మాట్లాడటం భావ్యం కాదన్నారు. స్వలాభం కోసం నోరుపారేసుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, కస్తూరి కూడా తక్షణం క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కేతిరెడ్డి హెచ్చరించారు.

చరిత్ర తెలియని అజ్ఞాని

వి.కృష్ణారావు



చరిత్ర ఏంటో తెలియని అజ్ఞాని నటి కస్తూరి అని ద్రావిడ దేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు మండిపడ్డారు. కస్తూరి వ్యాఖ్యలను ఆయన ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. సినిమాల్లో కనిపించినంత మాత్రాన ఆమె మహానటి కాజాలరన్నారు. తెలుగు ప్రజల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకోవడమే కాకుండా, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవలి ఎన్‌ఎంకే కన్వీనర్ సీమాన్, ఇపుడు కస్తూరి తెలుగువారిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి వారిని ఇకపై ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. ఒకపుడు చెన్నై మహానగరంలో 90 శాతం మంది తెలుగువారే ఉండేవారన్న విషయాన్ని ఆమె తెలుసుకోవాలన్నారు. చెన్నై నగరాభివృద్ధికి చెన్నయ్య అనే వ్యక్తి స్థలాన్ని ఇచ్చారనే విషయాన్ని ఆమె తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వంలో ఐదుగురు తెలుగువారికి మంత్రిపదవులు ఇవ్వడాన్ని కూడా ఆమె జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో చెన్నైతోపాటు ధర్మపురి, కృష్ణగిరి, కోవై, మదురై, విరుదునగర్, తిరుచ్చి, తిరువళ్ళూ రు, వేలూరు జిల్లాల్లో తెలుగు ప్రజలు అధికంగా ఉన్నారన్నారు. కస్తూరి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే ఆందోళనలు చేస్తామని వి.కృష్ణారావు హెచ్చరించారు.

తక్షణం ఉపసంహరించుకోవాలి

డాక్టర్ పొంగులేటి



సినీ నటి కస్తూరి తెలుగు ప్రజల గురించి చేసిన వ్యాఖ్యలను తక్షణం వెనక్కి తీసుకోవాలని బీజేపీ తమిళనాడు రాష్ట్ర జాతీయ ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర రెడ్డి డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఆయన సోమవారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తెలుగు ప్రజలను ఉద్దేశించి నటి కస్తూరి చేసిన వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. "ఎన్నో వందల సంవత్సరాలుగా తెలుగు, తమిళ ప్రజలు కలిసి మెలిసి ఉంటున్నారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో కొన్ని సంవత్సరాలపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఓ భాగంగా ఉంది. ఈ వ్యాఖ్యల వెనుక ఏదైనా అజెండా ఉందా, ఎవరిదైనా హస్తం ఉందా అనేది తెలియదు. ఏదిఏమైనా ఆమె చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి. కస్తూరి వెంటనే క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

మా పాలన గొప్పతనం తెలుసుకోండి

● కొత్తగా పార్టీలు పెట్టేవారంతా డీఎంకే నాశనాన్నే కోరుకుంటున్నారు
● విజయ్‌పై సీఎం స్టాలిన్ ధ్వజం



కొళత్తూరులో 'ముదల్వర్ పడైప్పగం' భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా రాజకీయ పార్టీలు ప్రారంభించేవారంతా డీఎంకే నాశనాన్ని కోరుకుంటున్నారని, వారికి నాలుగేళ్ల ద్రావిడ తరహా పాలనలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు గురించి తెలియకపోవడం శోచనీయమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ టీవీకే నేత విజయ్‌పై పరోక్షంగా ధ్వజమెత్తారు. సోమవారం ఉదయం తన నియోజకవర్గమైన కొళత్తూరులో కొన్ని పథకాలకు ప్రారంభోత్సవం, మరికొన్ని పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా కొళత్తూరు పెరియార్‌నగర్‌లోని అనితా అచీవర్స్ అకాడమీలో ఏర్పాటైన సభలతో ఆయన ప్రసంగిస్తూ నీట్ కారణంగా ఆత్మహత్య చేసుకుని విద్యార్థిని అనితా పేరుతో 2017లో స్థాపించిన ఈ అకాడమీలో శిక్షణ పొందినవారంతా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతుండటం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. నీట్ రద్దు కోసం తాము సుదీర్ఘ న్యాయపోరాటం సాగిస్తూనే ఉంటామని, ఏదో ఒక రోజు నీట్ రద్దయి తీరుతుందనే నమ్మకం తనకుందన్నారు. ప్రస్తుతం ఈ అకాడమీలో శిక్షణ పొందిన 457 మందికి లాప్‌టాప్‌లు, కుట్టుమిషన్లు అందించడం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. తన నియోజకవర్గంలో మొదటిసారిగా కో-వర్కింగ్ స్పేస్ 'ముదల్వర్ పడైప్పగం' భవనం ప్రారంభించామని, ఆ భవనంలో పోటీ పరీక్షలకు చదువుతున్న విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారనున్న యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ద్రావిడ తరహా డీఎంకే పాలనలో విద్య, వైద్యానికి, మహాభ్యుదయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, నాన్ ముదల్వన్, పుదుమైపెణ్, తమిళ్ పుదల్వన్ తదితర పథకాల ద్వారా యువతీయువకులు లబ్ధిపొందుతున్నారని చెప్పారు. ఇంచుమించు నాలుగేళ్ల డీఎంకే పాలనలో ఎన్నికల సమయంలో చేసిన హామీలను తొంభై శాతానికి పైగా నెరవేర్చామని, తక్కిన హామీలు కూడా ఆచరణకు నోచుకుంటాయని స్టాలిన్ అన్నారు. డీఎంకే ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మకమైన, పొరుగు రాష్ట్రాలు కూడా మెచ్చుకునే పలు సంక్షేమపథకాలు అమలు చేస్తున్నా, అభివృద్ధి ఎక్కడా కనిపించడమే లేదంటూ కొన్ని రాజకీయ పార్టీలు పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నాయన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో జరిగినట్లు కోటలో ప్రకటించిన పథకాలన్నీ కోటకే పరిమితమైనట్లు, తమ ప్రభుత్వం పథకాలను కాగితాలకే పరిమితం చేయడం లేదని, సంక్షేమ పథకాల ప్రకటన చేయడమే కాకుండా అవన్నీ సక్రమంగా అమలువుతున్నాయా? లేదా అని క్షేత్ర పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఇటీవల నగరంలో గంటసేపు వర్షం కురిసినప్పుడు వాన నిలిచిన కొన్ని గంటల్లోనే రోడ్లపై ప్రవహించిన నీరంతా కనిపించకుండా పోయిందని, ముందస్తు జాగ్రత్తలు చేపట్టడం వల్ల ఇది సాధ్యమైందని, వర్ష సూచన వెలువడగానే తానోవైపు, ఉప ముఖ్యమంత్రి మరోవైపు, మంత్రులు నలువైపులా పర్యటించి ముంద జాగ్రత్త చర్యలు చేపట్టడం వల్ల పల్లపు ప్రాంతాల్లో, రహదారులలో ప్రవహించిన నీరంతా మాయమైందన్నారు. డీఎంకేను పత్తాలేకుండా చేస్తామంటున్న కొత్త నేతలకు నాలుగేళ్లుగా డీఎంకే అమలు చేసిన పథకాల వల్ల రాష్ట్రం ఎదుగుతున్న విషయం తెలియకపోవడం శోచనీయమన్నారు. డీఎంకే వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై పనిగట్టుకుని విమర్శలు చేసే ప్రత్యర్థుల నుద్దేశించి 'విమర్శకులు వర్ధిల్లాలి' అంటూ ముక్తసరిగా సమాధానమిచ్చి ఊరుకునేవారని, ఆ నేత బాటలోనే తాను కూడా పసలేని విమర్శలు చేసేవారికి సమాధానాలిచ్చి తన విలువైన సమయాన్ని వృథా చేయదలచుకోలేదని అన్నారు.

ముదల్వర్‌పడైప్పగం ప్రారంభం..

కొళత్తూరు నియోజకవర్గం అగరం జగన్నాథన్ వీధిలో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ (సీఎండీఏ) సంయుక్త ఆధ్వర్యంలో రూ.2.85 కోట్లతో 'కో- వర్కింగ్ స్పేస్', పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 'విద్యాకేంద్రం' తదితర సదుపాయలు కలిగిన 'ముదల్వర్ పడైప్పగం' (సీఎం సృజనాత్మక) భవనాన్ని మంగళవారం ఉదయం స్టాలిన్ ప్రారంభించారు. ఇదే విధంగా జీకే ఎం కాలనీలో ఏర్పాటైన మరొక కార్యక్రమంలో జీసీసీ మూలధన నిధి కింది 64వ వార్డులోని మహమ్మద్ హుసేన్ కాలనీలో రూ.22.90 లక్షలతో నిర్మించిన బహుళార్థ సాధక భవనం, కొళత్తూరు ఎమ్మెల్యే అభివృద్ధి నిధి కింద జీకేఎం కాలేజీ 24వ వీధిలో రూ.58 లక్షలతో నిర్మించిన బహుళార్థక సాధక కేంద్రాలను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆ తర్వాత ఆ భవన సముదాయంలోనే ఏర్పాటు చేసి రేషన్‌షాపులో కార్డుదారులకు ఆయన సరకులను పంపిణీ చేశారు. ఇదే విధంగా జవహర్ నగర్‌లో కార్పొరేషన్ క్రీడా మైదానంలో రూ.43 లక్షలతో మహిళల కోసం నిర్మించనున్న ఇండోర్ వ్యాయామ కేంద్రానికి, ఎంపీ గిరిరాజన్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో రూ.38.50 లక్షలతో నిర్మించనున్న గ్రంథాలయభవనాని కి శంకుస్థాపన చేశారు. చివరగా జీకేఎం కాలనీలోని కొలను మరమ్మతు పనులు, నీటిసరఫరా, మురుగునీటి తొలగింపు కేంద్రాల పనితీరును కూడా సీఎం తనిఖీ చేశారు. కార్యక్రమంల్లో మంత్రులు కేఆర్ పెరియకరుప్పన్, ఆర్.చక్రపాణి, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, ఎమ్మెల్యేలు తాయగం కవి, జోసెఫ్ శామువేల్, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, సహకార, ఆహార వినియోగదారుల సంరక్షణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.రాధాకృష్ణన్, గృహ వసతి నగరాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉషా, చెన్నై మహానగరాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశం... విభిన్న సంస్కృతుల సమాహారం

● గవర్నర్ ఆర్ఎన్ రవి ● రాజ్‌భవన్‌లో ఘనంగా 16 రాష్ట్రాల అవతరణ దినోత్సవం

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత దేశం విభిన్న సంస్కృతుల సమాహారమని, ఏక్ భారత్, స్వచ్ఛ భారత్ అనే నినాదంతో ప్రపంచానికే ఆదర్శంగా ఉందని గవర్నర్ ఆర్ఎన్ రవి అభివర్ణించారు. దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవం సోమవారం సాయంత్రం గిండిలోని రాజ్ భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి తదితర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, భాషా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ రవి మాట్లాడుతూ... వివిధ భాషలు, మతాలు, కులాలున్న భారత దేశం వసుధైక కుటుంబని, ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. ఒక్కో భాషకు వందల ఏళ్లనాటి చరిత్ర ఉందని, మన భాషలను, సంస్కృతులను గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు సీఎంకే రెడ్డి, ఉపాధ్యక్షులు గొల్లపల్లి ఇశ్రాయేలు, కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్టీలు దేసు లక్ష్మీనారాయణ, ఎస్ఎల్ సుదర్శనం, తెలుగు మహాజన సంఘం అధ్యక్షుడు కాకుటూరు అనీల్‌కుమార్‌రెడ్డి, కళాసుధ అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్, అపోలో ఫార్మసీ ఎండీ ఎస్.ఓబుల్‌రెడ్డి, డా.వైవీసీ రెడ్డి, డా.వై.విజయచంద్రా రెడ్డి తదితర ప్రముఖులు గవర్నర్‌ను సత్కరించారు. అదే విధంగా గవర్నర్ కూడా వీరిని జ్ఞాపికలతో గౌరవించారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.





హోజరైన ఆహూతులు - గవర్నర్ రవితో తెలుగు ప్రముఖులు

మళ్ళీ గ్యాస్ లీక్

●తిరువొత్తియూరు పాఠశాలలో నలుగురు విద్యార్థినులకు అస్వస్థత
● పోలీసుల మోహరింపు



పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూరు గ్రామవీధిలోని విక్టరీ మెట్రిక్యులేషన్ పాఠశాలలో సోమవారం మళ్ళీ గ్యాస్ లీక్ అయ్యింది. ఆ గ్యాస్ పీల్చిన నలుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులంతా ఆ పాఠశాలను ముట్టడించారు. తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్ళారు. ఈ సంఘటన కారణంగా ఆ పాఠశాల ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు పరిస్థితి చక్కదిద్దటానికి ఆ స్కూలు దగ్గరకు తరలివెళ్ళారు. ఈ పాఠశాలలో ఆరు నుండి ప్లస్-2 వరకు రెండు వేలకు పైగా విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం మూడో అంతస్థులో 6 నుంచి ప్లస్-2 వరకు క్లాసులున్నాయి. ఆ అంతస్థులోనూ రసాయన శాస్త్ర ప్రయోగశాల ఉంది. అక్టోబరు 26న ఆ ప్రయోగశాల నుంచి విషవాయువు వెలువడి 45 మంది విద్యార్థినులు వాంతులు చేసుకుని మూర్ఛిల్లారు. పలువురికి కళ్లలో మంటలు, గొంతులో మంట కూడా ఏర్పడింది. వెంటనే వీరిని ఆస్పత్రికి తరలించారు. ఆ సంఘటన దరిమిలా ఆ పాఠశాలకు వారం రోజులు సెలవు ప్రకటించారు. ఆ ప్రయోగశాలను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీ చేశారు. ఆ సంఘటన జరిగి రోజులు గడిచినా విషవాయువు ప్రయోగశాల నుంచి లీకైందా? లేక మరో ప్రాంతం నుంచి సిలిండెర్ గ్యాస్ లీకయిందా? అని కనుగొనలేకపోయారు. ఈ నేపథ్యంలో దీపావళి సెలవుల తర్వాత మంగళవారం స్కూల్ పునఃప్రారంభించారు. పాఠశాలలో ఉన్నట్టుండి విషవాయువు వెలువడింది. వెంటనే నలుగురు విద్యార్థినులు ఆ వాయువు పీల్చి అస్వస్థత చెందారు. మరికొందరు విద్యార్థులకు ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది. ఆ విష వాయువు అన్ని తరగతి గదులకు వ్యాపించింది. దీంతో భీతిల్లిన తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల నుంచి ఇళ్లకు తీసుకు వెళ్లారు. సుమారు వందమందికిపైగా తల్లిదండ్రులు ఆ పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. జిల్లా విద్యాశాఖాధికారి మురుగన్, డీఎస్పీ శక్తివేల్, ఏసీపీ ఇలంగోవన్, సీఐలు రజినీష్, కృష్ణరాజ్, తిరువొత్తియూరు జోనల్ అధికారి పురుషోత్తమన్ హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. శాసనసభ్యుడు కేపీ శంకర్, అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే కే కుప్పతన్, కౌన్సిలర్ డాక్టర్ కే కార్తీక్ కూడా ఆ పాఠశాలను సందర్శించారు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత నెల 26న విషవాయువు వెలువడినా ఎక్కడి నుండి వెలువడింతో పాఠశాల యాజమాన్యం కనుగొనలేకపోయిందని ఆరోపించారు. ఇకనైనా అధికారులు ఆ విషవాయువు వెలువడే ప్రాంతాన్ని గుర్తించి, కట్టుదిట్టం చేయాలని, లేకుంటే తమ పిల్లల ప్రాణాలకు ముప్పువాటిల్లడం ఖాయమన్నారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన మీదట కోలుకున్నారని అధికారులు తెలిపారు. గ్యాస్ లీక్ కారణంగా మంగళవారం ఆ పాఠశాలకు సెలవు ప్రకటించారు.

పెరుగుతున్న జ్వరాలు

● కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



కడలూరు ప్రభుత్వాస్పత్రిలో క్యూలో ఉన్న రోగులు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాల్లో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, వాతావరణంలో మార్పుల కారణంగా పిల్లల నుంచి పెద్దల వరకు ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గు, జ్వరం తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. ఈ లక్షణాలతో రోగులు కడలూరు, చిదంబరం, కురింజిపాడి, కాట్టుమన్నార్‌కోయిల్, తిట్టకుడి, విరుదాచలం, బన్రూటి తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రులు, శివక్కం, వల్లంపాదుగ్రై, కవరపట్టు, పుదుసత్రం సహా పలు ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. ఒకే సమయంలో ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద 500 మంది వస్తుండడంతో వారు అధిక సమయంకూ లైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై కడలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు మాట్లాడుతూ... ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా జలుబు, దగ్గు, జ్వరం తదితరాలతో ప్రజలు అధికంగా బాధపడుతున్నారన్నారు. రోగులకు తగిన పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి పంపుతున్నామని తెలిపారు.

అన్నాడీఎంకే నాయకుడి హత్య

● శివగంగలో ఉద్రిక్తత

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శివగంగ పరిధిలోని నాటకుడికి చెందిన అన్నాడీఎంకే నేత గణేశన్ (70) సోమవారం తెల్లవారుజామున దారుణహత్యకు గురయ్యారు. గణేశన్ ఆ ప్రాంతంలో కిరాణా దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, ఆయన హత్యకు గురికావడం ఆ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీసింది. సమాచారం తెలిసి రంగంలో దిగిన పోలీసులు గణేశన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శివగంగ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో... హంతకుడు అదే గ్రామానికి చెందిన బాలు అని, పరారీలో ఉన్న అతడి కోసం గాలిస్తున్నన్నారు. దీపావళి రోజు నుంచి మూడు రోజుల్లో శివగంగ ప్రాంతంలో మూడు హత్యలు జరగడం స్థానికులను ఆందోళనకు గురిచేసింది.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ



పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా తొట్టియం సమీపంలో ఓ వ్యక్తి హఠాత్తుగా మనమేడు రోడ్డు దాటేందుకు యత్నించాడు. ఆ సమయంలో వస్తున్న లారీ ఆ వ్యక్తిని ఢీకొని అదే వేగంతో రోడ్డు పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో అజాగ్రత్తగా రోడ్డు దాటేందుకు యత్నించిన వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఇద్దరు లారీ డ్రైవర్లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. కాగా, లారీ దూసుకెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

అడవి పంది మాంసం దాచిన వ్యక్తికి జరిమానా

వేలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారి గురుస్వామి ఆదేశాలతో పేర్నాంబట్టు అటవీ శాఖ అధికారి సతీష్‌కుమార్ నేతృత్వంలో పల్లాల్‌కుప్పంలో తనిఖీలు చేపట్టారు. ఏర్పన్‌తాంగ్ సమీపం కలార్‌పాళ్యంలో గస్తీ తిరుగుతుండగా అదే ప్రాంతానికి చెందిన సంపత్ రెండు అడవి పందులను హతమార్చి మాంసం దాచాడని సమాచారం అందింది. ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన అధికారులు, సంపత్ నుంచి 2 కిలోల మాంసం స్వాధీనం చేసుకొని, అతనికి రూ.20 వేలు జరిమానా విధించారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం

వేలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెరుముగ్గై పాలారులో ఇసుకతో పాటు టిప్పర్ లారీ, రెండు సరుకు వ్యాన్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు, పరారైన వారి కోసం గాలిస్తున్నారు. సత్తువాచ్చేరి ఏసీపీ నందకుమార్ నేతృత్వంలో పోలీసులు పెరుముగ్గై ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీ, రెండు సరుకు వ్యాన్‌లను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను గమనించిన వాహనాల్లో వారు తప్పించు పారిపోయారు. వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు, పరారైన వారి కోసం గాలిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ యజమానిపై హత్యాయత్నం

● ముసుగు దొంగల బీభత్సం

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా వందవాసి సమీపంలో ఆదివారం రాత్రి ముసుగు దొంగలు ఒక రియల్ ఎస్టేట్ యజమానిపై హత్యాయత్నం చేశారు. పోలీసుల కథనం మేరకు... నగర శివారు ప్రాంతమైన మన్నివాక్కంకు చెందిన జయచంద్రన్ (52) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. వందవాసి సమీపంలోని కూణంపాడి గ్రామంలోని ఇంటి స్థలంతోపాటు కొంత వ్యవసాయ భూమి కూడా కొనుగోలు చేసి, అక్కడే తన కుటుంబంతో ఉంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఒంటి గంట సమయంలో ద్విచక్రవాహనంలో వచ్చిన ముగ్గురు ముసుగు దొంగలు జయచంద్రన్ ఇంటికి వచ్చి ఆయనపై దాడికి పాల్పడ్డారు. అయితే, ఈ దాడి నుంచి జయచంద్రన్ తప్పించుకున్నారు. తీవ్రంగా గాయపడిన జయచంద్రన్‌ను వందవాసి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడ నుంచి చెన్నైకి తరలించారు. ఈ ఘటనపై తెన్నార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సీఎస్ఐ చర్చిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ



పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మదురై కీలవాసల్ ప్రాంతంలో ఉన్న సీఎస్ఐ చర్చిలో ప్రార్థనా సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగి తోపులాటకు దారితీసింది. పాస్టర్ రాజా స్టాలిన్ నేతృత్వంలో ప్రార్థనలు జరుగుతుండగా, ఆదాయ, వ్యయానికి సంబంధించి ఖర్చులు తెలియజేసే సమయంలో కొత్త కమిటీ, పాత కమిటీ సభ్యుల మధ్య వాగ్వివాదం తలెత్తింది. ఈ ఘటనపై ముగ్గురిపై కీలవాసల్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

నేడు కోవైలో స్టాలిన్ పర్యటన

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరుతున్నాయా అని ముఖ్యమంత్రి స్టాలిన్ జిల్లాలవారీగా పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్టాలిన్ కోవై వెళ్లనున్నారు. అక్కడ ఆయన మంగళ, బుధవారాల్లో మకాం వేసి పలు కార్యక్రమాల్లో పాల్గొని పరిశీలించనున్నారు. ఇందుకోసం మంగళవారం ఉదయం 10 గంటలకు చెన్నై నుంచి విమానంలో బయల్దేరి కోవై చేరుకుంటారు. 11.30 గంటలకు విలాంగుర్చి ప్రాంతంలోని ఎల్కాట్ సంస్థ ఆధ్వర్యంలో సమాచార సాంకేతిక ప్రత్యేక ఆర్థిక జోన్ ప్రాంగణంలో రూ.114.16 కోట్లతో నిర్మించిన పార్క్ భవనాన్ని సీఎం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు విశ్వకర్మ సంక్షేమ సంఘం నేతలతో సీఎం సమావేశమవుతారు. ఆ తర్వాత పోతనూరులో డీఎంకే నిర్వాహకులతో సమావేశమై 2026లో అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికలకు సంబంధించి సూచనలిస్తారు. 6వ తేది ఉదయం 9.30 గంటలకు కోవై కేంద్ర కారాగారం ప్రాంగణంలో నిర్మిస్తున్న సెమ్మొళి పార్క్ పనులను పరిశీలిస్తారు. ఈ సందర్భంగా జైలు ప్రాంగణంలో రూ.300 కోట్లతో నిర్మించనున్న కలైంజర్ సెంటినరీ లైబ్రరీకి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం కోవై నుంచి విమానంలో సీఎం స్టాలిన్ నగరానికి తిరిగొస్తారు. సీఎం రాకను పురస్కరించుకొని కోవై పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటైంది.

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు డ్రెస్ కోడ్

● హైకోర్టులో పిటిషన్

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు ధరించే దుస్తులకు సంబంధించిన డ్రెస్ కోడ్ నిబంధనలు విధించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో కొత్తగా పిటిషన్ దాఖలైంది. మద్రాసు హైకోర్టులో న్యాయవాది పి.ప్రవీణ సమాధానం దాఖలుచేసిన పిటిషన్‌లో... రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి డీఎంకే జెండా, చిహ్నంతో కూడిన టీ-షర్ట్ ధరించి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. పార్టీలకతీతంగా వ్యవహరించాల్సిన ఉప ముఖ్యమంత్రి పార్టీ గుర్తుతో కూడిన టీ-షర్ట్‌తో ప్రభుత్వ సంక్షేమ సహాయాలు అందిస్తే, అది డీఎంకే తరపున పంపిణీ చేసినట్లు అవుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉప ముఖ్యమంత్రి డ్రెస్ కోడ్ పాటించకపోవడం చట్టవిరుద్ధమన్నారు. అందువల్ల ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు డ్రెస్ కోడ్‌కు సంబంధించిన నిబంధనలు రూపొందించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుంది. ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పార్టీ లోగోతో కూడిన టీ-షర్ట్ ధరించడాన్ని వ్యతిరేకిస్తూ సేలయూరుకు చెందిన న్యాయవాది సత్యకుమార్ దాఖలుచేసిన పిటిషన్ విచారణలో ఉండడం గమనార్హం.

నీటి వనరులను ప్రైవేటుపరం చెయ్యొద్దు

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో ప్రభుత్వానికి చెందిన నీటివనరులను ప్రైవేటీకరణ చేయడం సరికాదని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రత్యేక పథకాలకు సంబంధించి గత నెల 18 నుంచి నీటివనరులు, మరికొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని ఖండిస్తూ పీఎంకే ఆధ్వర్యంలో రైతుసంఘాలతో కలసి పలు జిల్లాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్బుమణి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ప్రైవేటు భూముల సమీపంలో ఉన్న చెరువులు, వాగులు తదితర నీటివనరులను ప్రైవేటీకరణ చేయడం వల్ల భవిష్యత్తులో రాష్ట్రానికి ముప్పు వాటిల్లే అవకాశముందని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వాపసు తీసుకోవాలని, దీనిపై వచ్చే నెల జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక తీర్మానం కూడా ప్రవేశపెట్టాలని అన్బుమణి డిమాండ్ చేశారు.

విమాన చార్జీలకు రెక్కలు

● చెన్నై వచ్చే అన్ని సర్వీసుల్లో ఇదే పరిస్థితి

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ ముగియడంతో సొంతూళ్ళకు వెళ్ళిన వారంతా తిరిగి నగరానికి చేరుకుంటున్నారు. దీంతో విమాన చార్జీలకు రెక్కలు వచ్చాయి. ముఖ్యంగా, ఇతర ప్రాంతాల నుంచి చెన్నై వచ్చే అన్ని విమాన సర్వీసుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. సాధారణ రోజుల్లో గరిష్టంగా రూ.5 వేలుండే ప్రయాణ చార్జీ రెట్టింపు అయింది. ముఖ్యంగా మదురై నుంచి చెన్నైకు సోమవారం ఉదయం వచ్చే విమాన సర్వీసులో ప్రయాణ చార్జీ రూ.10,119గా వసూలు చేశారు. అదే చెన్నై నుంచి మదురై వెళ్ళేందుకు చార్జీ రూ.4,260 వసూలు చేశారు. అలాగే, తూత్తుక్కుడి నుంచి చెన్నైకు రూ.11,925 వసూలు చేయగా, చెన్నై నుంచి తూత్తుక్కుడికి రూ.6,771గా వసూలు చేశారు. తిరుచ్చి నుంచి చెన్నైకి రూ.11,109 ఉండగా, చెన్నై నుంచి తిరుచ్చికి రూ.5,796గా వసూలు చేశారు. కోవై నుంచి చెన్నైకి రూ.10,179 వసూలు చేయగా, చెన్నై నుంచి కోవైకు రూ.4,466, సేలం నుంచి చెన్నైకి రూ.9,516, చెన్నై నుంచి సేలం రూ.4,647 వసూలు చేశారు. ఒక్కసారిగా ప్రయాణ చార్జీలను రెట్టింపు చేయడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు.

పిండిని మళ్లీ రుబ్బుతున్న విజయ్

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయ్ పార్టీ అజెండా రుబ్బిన పిండిని మళ్లీ రుబ్బుతున్నట్లుగా ఉందని, అలా చేయడం వల్ల పిండి వృధా అవుతుందనే విషయం గ్రహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ హితవు పలికారు. తంజావూరు జిల్లా కుంభకోణంలో సోమవారంజరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రస్తుతం సంబా సాగుల్లో రైతులు ముమ్మరంగా ఉన్నారని, సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలుసహా పంట రుణాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నటుడు విజయ్, డీఎంకే ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారనే విలేఖరుల ప్రశ్నకు, పార్టీ ప్రారంభించిందే డీఎంకేను విమర్శించేందుకు అని ఆయన జవాబిచ్చారు. విజయ్‌పార్టీతో సీపీఐ పొత్తు ఉంటుందా అనే ప్రశ్నకు, ఆ విషయం మీకే ముందుగా చెబుతానని ముత్తరసన్ చమత్కరించారు.

మణిపూర్ యువకుడి హత్య

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరువాన్మియూరులో ఒకే గదిలో ఉంటున్న మణిపూర్‌కు చెందిన ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు దారుణహత్యకు గురయ్యాడు. మణిపూర్‌కు చెందిన కైసుయన్‌లియన్ (30), పావ్‌మిన్లిన్ చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ తిరువాన్మియూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటూ హోటల్‌లో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి నిద్రపోతున్న సమయంలో అర్ధరాత్రి పావ్‌మిన్లిన్‌కు అతడి గర్ల్‌ఫ్రెండ్ ఫోన్ చేసింది. ఆమెతో మాట్లాడుతూ పావ్‌మిన్లిన్ బిగ్గరగా తిట్టాడు. ఆ కేకలకు గాఢ నిద్రలో ఉన్న కైసుయన్‌లియన్ లేచి అతడిని తిట్టాడు. దీంతో ఇరువురూ గొడవపడ్డారు. ఆగ్రహించిన పావ్‌మిన్లిన్ కత్తెర తీసుకుని కైసుయన్‌లియన్ గొంతుపై పొడిచాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి పావ్‌మిన్లిన్‌ను అరెస్టు చేశారు.

గత నెలలో 90.83 లక్షల మంది మెట్రో పయనం

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో అక్టోబరు నెలలో 90.83 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) విడుదల చేసిన ప్రకటనలో... సెప్టెంబరులో 92,77,697 మంది ప్రయాణించగా, అక్టోబరులో 90,83,996మంది మెట్రోరైళ్లలో ప్రయాణం చేశారు. అక్టోబర్ 6వ తేది అధికంగా 4,00,042 మంది ప్రయాణించారు. వీరిలో ట్రావెల్ కార్డ్ ద్వారా 28,88,168 మంది, టోకన్ల ద్వారా 4,287, గ్రూప్ టిక్కెట్ల ద్వారా 5,400, క్యూ ఆర్ కోడ్ వినియోగించి 40,75,66, వాట్సాప్ వినియోగించి 5,78,048, పేటీఎం వినియోగించి 4,40,000, ఫోన్ పే వినియోగించి 3,48,378 మంది, సింగార చెన్నై కార్డు ద్వారా 20,50,699 మంది ప్రయాణించినట్లు సీఎంఆర్ఎల్ తెలియజేసింది.

బైకును ఢీకొన్న కారు

● మాధవరం మహిళా ఎస్ఐ, కానిస్టేబుల్ మృతి



ప్రమాదంలో ధ్వంసమైన బైకు, కారు, ఇన్‌సెట్‌లో ఎస్ఐ జయశ్రీ, కానిస్టేబుల్ నిత్య (ఫైల్‌ఫొటో)

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మధురాంతకం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మాధవరం డైరీ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ జయశ్రీ (38), కానిస్టేబుల్ నిత్య (35) మృతి చెందారు. వీరిద్దరూ ఓ నేరస్థుడిని పట్టుకునేందుక బైకులో వేకుజాము రెండు గంటలకు మేల్‌మరువత్తూరు బయలుదేరారు. మదురాంతకం సమీపం తిరుచ్చి జాతీయ రహదారిలో తిరువణ్ణామలై వెళుతున్న కారు వీరి బైకును ఢీకొంది. దీంతో వారిద్దరూ రోడ్డుపై దూరంగాపడ్డారు. జయశ్రీ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న నిత్య, కారు డ్రైవర్ మదన్ కుమార్‌లను చికిత్స నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక నిత్యా మృతి చెందారు. ఇదిలా ఉండగా ఎస్ఐ జయశ్రీ విధి నిర్వహణలో పలువురి ప్రశంసలందుకున్నారని మాధవరం డైరీ పోలీసుస్టేషన్ అధికారులు చెబుతున్నారు. సెలవులో ఉన్నా సోమవారం ఉదయం నేరస్థుడిని పట్టుకోవాలన్న తపనతో ఆమె బుల్లెట్‌లో వెళ్ళారని, దురదృష్టవశత్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం శోచనీయమన్నారు.

బురదమయమైన రోడ్లతో ఇక్కట్లు

● గ్రామస్తుల వినూత్న నిరసన



రోడ్డుపై నాట్లు వేస్తూ గ్రామస్తుల నిరసన

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా జయంకొండాం పంచాయతి సత్య నగర్‌లో 50కి కుటుంబాలు నివశిస్తున్నాయి. ఈ గ్రామానికి వెళ్లే రోడ్డు కొది నెలలుగా ధ్వంసమైంది. చిన్న వర్షానికే రోడ్డు బురదమయమై నడవలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విద్యార్థులు, మహిళలు ఈ రోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై పంచాయతీ ప్రతినిధులు, అధికారులకు తెలిపినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో, రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో రోడ్డు మరింత ఛిద్రంగా మారింది. దీంతో, ఆగ్రహించిన గ్రామస్తులు బురదమయంగా మారిన రోడ్డు మధ్య నాట్లు వేస్తూ నిరసన తెలిపారు.

సమాచార దృష్టి

సౌదీలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియా ఆస్పత్రుల్లో పని చేసేందుకు మహిళా నర్సులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి, రెండేళ్ల అనుభవం ఉన్న 35 ఏళ్లలోపున్న వారు ఈ పోస్టులకు అర్హులు. ఈ పోస్టులకు సంబంధించిన ఇంటర్వ్యూలు ఈ నెల 13 నుంచి 15వ తేది వరకు కొచ్చిన్‌లో జరుగనున్నాయి. భోజనం, బస, విమాన టిక్కెట్లు తదితరాలు సంబంధిత ఆస్పత్రి నిర్వాహకులు ఏర్పాటు చేస్తారు. మరిన్ని వివరాలకు www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్, 95662 39685, 63791 79200, 044-22505886 నెంబర్లలో సంప్రదించవచ్చు.

తపాలా శాఖ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాజీ ఉద్యోగులు తపాలా శాఖ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు పొందవచ్చు. పింఛన్‌దారులు ప్రతి సంవత్సరం లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంది. పింఛన్‌దారుల సౌకర్యార్థం తపాలా శాఖ ఆధ్వర్యంలోని 'ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్' డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందజేయనుంది. పింఛన్‌దారులు సమీపంలోని తపాలా కార్యాలయంలో సంప్రదిస్తే, తపాలా సిబ్బంది వారింటికే వెళ్లి వేలిముద్రలు, సర్టిఫికెట్లు పరిశీలించి అక్కడే డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్లు అందించనున్నారు. అందుకోసం సేవా రుసుముగా రూ.70 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, పింఛన్‌దారులు https://ccc.cept.gov.in/ServiceRequest/request.aspx అనే వెబ్‌సైట్, Postinfo అనే యాప్ ద్వారా కూడా ఇంటి వద్దే సర్టిఫికెట్ పొందేందుకు పేరు నమోదు చేసుకోవచ్చని చెన్నై నగర మండల తపాలా శాఖ అధ్యక్షులు జి.నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదిద్రావిడులకు ఇళ్ల పట్టాలు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదిద్రావిడుల కోసం ఖాళీ స్థలాలు గుర్తించి, అర్హత కలిగిన వారిని ఎంపిక చేసి ఉచితంగా ఇళ్ల పట్టాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆదిద్రావిడ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో ఆదిద్రావిడులకు ఉచితంగా ఇళ్ల పట్టాలు అందజేస్తున్నారు. కాగా పలువురు ఆ స్థలాలు వినియోగించుకోవడం లేదు. అటువంటి స్థలాలు గుర్తించి, అర్హత కలిగిన ఆదిద్రావిడులకు ఉచిత ఇళ్ల పట్టాలు అందజేయాలని ప్రభుత్వం సూచించింది.

రాష్ట్రానికి చేరిన కృష్ణా జలాలు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి రాష్ట్రానికి టీఎంసీ కృష్ణా జలాలు అందాయి. కృష్ణా నదీజలాల ఒప్పందంలో భాగంగా ఆంధ్ర రాష్ట్రం కండలేరు నుంచి ప్రతి ఏడాది రాష్ట్రానికి రెండు విడతలుగా 12 టీఎంసీల కృష్ణా జలాలు అందించాల్సి ఉంది. ఈ ఏడాది సెప్టెంబరు 19న విడుదల చేసిన కృష్ణా జలాలు సాయిగంగ కాలువ ద్వారా 23వ తేది ఉదయం రాష్ట్ర సరిహద్దు ఊత్తుకోట జీరో పాయింట్‌కు, మరుసటిరోజు ఉదయం పూండి జలాశయానికి చేరుకున్నాయి. ఆ ప్రకారం, ఆదివారం నాటికి రాష్ట్రానికి టీఎంసీ కృష్ణా జలాలు చేరాయి.

అడయార్ ఫ్లై ఓవర్‌పై టూవే

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ జంక్షన్ ఫ్లై ఓవర్‌ను టూవేగా మార్చారు. అడయార్ జంక్షన్ ఫ్లై ఓవర్ నుంచి తిరువిక బ్రిడ్జి నుంచి గిండీ, తిరువాన్మియూర్ వైపుకు వాహనాలను అనుమతిస్తున్నారు. అందువల్ల ఫ్లై ఓవర్ కింద ఉన్న సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ తగ్గింది. ప్రస్తుతం కింది రోడ్డు ఆవిన్ సమీపంలో మెట్రోపనుల కారణంగా బ్యారికేడ్లు ఏర్పాటుచేయడంతో ట్రాఫిక్ రద్దీ అధికమైంది. ఈ సమస్య పరిష్కరించేలా గిండి నుంచి తిరువిక వంతెన వైపు వెళ్లేందుకు ఫ్లై ఓవర్‌ను టూవేగా మార్చినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేకే నగర్, అంబత్తూర్, మైలాపూర్, తండయార్‌పేట మండలాల్లో మంగళవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. కేకే నగర్ మండల పరిధిలోని 110 కేవీ. ఉప విద్యుత్ కేంద్రంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, అంబత్తూర్ మూడో మెయిన్ రోడ్డులో ఉప విద్యుత్ కేంద్రంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, మైలాపూర్ మండల పరిధిలో వళ్లువర్‌కోట్టం సమీపం ఉప విద్యుత్ కేంద్రలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, తండయార్‌పేట పరిధిలో టవర్ క్లాక్ సమీపంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లో ఈ శిబిరాలు జరుగనున్నాయని, ఆయా మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలియజేసింది.

సెల్‌ఫోన్ చూస్తూ బస్సు నడిపిన డ్రైవర్ సస్పెన్షన్

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ చూస్తూ బస్సు నడిపిన డ్రైవర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. నాగపట్టణం సమీపంలో బస్సు డ్రైవర్ శక్తివేల్ సెల్‌ఫోన్ చూస్తూ బస్సు నడుపుతుండడాన్ని ఓ ప్రయాణికుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్ శక్తివేల్‌ను సస్పెండ్ చేస్తూ రవాణా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

లభించని సిగ్నల్స్...!

● సెల్ టవర్ కోసం గ్రామస్తుల రాస్తారోకో



రోడ్డుకు అడ్డంగా బైక్‌లు ఉంచి రాస్తారోకోలో గ్రామస్తులు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా పెన్నాగరం సమీపం కాట్టుపట్టి గ్రామంలో 200లకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుచేయాలని గ్రామస్తులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం ఉదయం గ్రామస్తులు సుమారు 30 ద్విచక్రవాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలిపి రాస్తారోకో చేపట్టారు. బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుచేయాలంటూ వారు నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పెన్నాగరం పోలీసులు అక్కడకు చేరుకొని గ్రామస్తులతో చర్చించి ఆందోళన విరమింపజేశారు.

మదురైలో లైవ్ ఫిష్ విక్రయాలు



తొట్టెల్లో ఉంచిన చేపలు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మదురై సెల్‌పేటలోని చేపల మార్కెట్లో, బతికున్న చేపలను విక్రయిస్తుండడంతో ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. అయిరై, విరాల్, కొళత్తి సహా పలు రకాల చేపలు ఈ మార్కెట్‌కు తెస్తుంటారు. సత్తిరపట్టి, అళగర్‌కోవిల్, మేలూరు, ఉసిలంబట్టి, తిరుమంగళం తదితర ప్రాంతాల్లోని జలాశయాల్లో పట్టుకొచ్చే అయిరై చేపలు సుమారు రూ.1,200 వరకు విక్రయమవుతున్నాయి. సహజంగా ఎక్వేరియంలో సంచరించే చేపలు ఈ మార్కెట్‌లోని దుకాణాల్లో తొట్టెలో సంచరించడాన్ని పిల్లలు ఆసక్తిగా చూస్తున్నారు.

కోవైలో సైనికుల ఎంపిక శిబిరం



శిబిరంలో పాల్గొన్న అభ్యర్థులు

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో జరిగిన సైనికుల ఎంపిక శిబిరంలో అభ్యర్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. 174 మంది సైనికులు, 50 క్లర్క్ పోస్టులకు పోలీసు శిక్షణా పాఠశాలలో జరిగిన ఈ ఎంపిక శిబిరంలో కోవై, పుదుచ్చేరి, పొరుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు పాల్గొన్నారు. 10వ తేది వరకు జరుగనున్న దేహదారుఢ్య పరీక్షల్లో 7,8 తేదీల్లో రాష్ట్రానికి చెందిన వారు పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

ముడిచ్చూరులో ముగిసిన వైద్య శిబిరం



శిబిరం ప్రారంభోత్సవంలో వైద్యులు

అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ ఆదిఆంధ్ర అరుంధతీయ ఆదివాసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగర శివారు ప్రాంతమైన తాంబరం సమీపంలోని ముడిచ్చూరులో ఉన్న సీఎస్ఐ చర్చిలో వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో దాదాపు వంద మంది వరకు స్థానికులు వివిధ రకాల వైద్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సంతోష్ కిషోర్ చంద్రశేఖర్, డాక్టర్ కొల్లి మహేష్, డాక్టర్ కొల్లిరాజు, డాక్టర్ పి.రాధమ్మ, స్టాఫ్ నర్స్ మెర్లిన్ మోనికాతో కూడిన వైద్య బృందం పాల్గొని వైద్య పరీక్షలను నిర్వహించింది. ఈ వైద్య శిబిరాన్ని 'మాస్' ప్రధాన కార్యదర్శి ఎ.హజరత్తయ్య సమన్వయం చేయగా, మాస్ నిర్వాహకులు పి.రాజేష్, టి.అలెగ్జాండర్, సీఎస్ఐ చర్చి పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో భక్తుల కోసం టాయిలెట్లు



ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

వేలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేన్‌పాక్కం సెల్వ వినాయకుడి ఆలయానికి వచ్చే భక్తుల కోసం వేలూరు రోటరీ సంఘం, బియ్యం మండీ వ్యాపారుల సంఘం సంయుక్తంగా టాయిలెట్లు నిర్మించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో రోటరీ 25-26 గవర్నర్ డీజీఐ సురేష్, రోటరీ సంఘ అధ్యక్షుడు బాలమురుగన్, బియ్యం మండీ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గణేష్ అరుణగిరి తదితరులు ఈ టాయిలెట్లను భక్తులకు అందుబాటులోకి తెచ్చారు.

తూత్తుకుడి హార్బర్ నుంచి 2.40 కోట్ల టన్నుల సరుకుల ఎగుమతి

పెరంబూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి వావూసీ హార్బర్ నుంచి విదేశాలకు గోధుమ సహా పలు ఆహార దినుసులు, రెడీమేడ్ దుస్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఎగుమతి చేస్తుండగా, విదేశాల నుంచి నేలబొగ్గు, పప్పు ధాన్యాల రకాలు, రసాయన పదార్థాలు దిగుమతవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు నెలాఖరు వరకు 2.40 కోట్ల టన్నుల సరుకులను ఎగుమతి చేసి రికార్డు సృష్టించింది. ఇదే గత ఏడాది ఇదే కాలంలో 2.37 కోట్ల టన్నుల సరుకులను తరలించారు. ఈ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎగుమతుల్లో 3.61 శాతం, కంటైనర్ల రవాణాలో 6.25 శాతం వృద్ధి సాధించినట్లు హార్బర్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.



వేలూరు డివిజన్ అసిస్టెంట్ సూపరెండెంట్ పృథ్వీరాజ్ సాకిన్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న జిల్లా ట్రాన్స్‌పోర్ట్ పోలీసు గ్రూపు సెక్రటరీ డా.ఇక్రమ్, ట్రాన్స్‌పోర్ట్ పోలీసు కమిటీ ఉపాధ్యక్షుడు రామచంద్రన్, కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం అవైై అధ్యక్షుడు జనార్దనన్ తదితరులు

ఏకపక్ష నిర్ణయాలకు 'నడిగర్' వ్యతిరేకం

● సంఘం అధ్యక్షుడు నాజర్



ఈ నెల ఒకటో తేదీ నుంచి కొత్త చిత్రాల ప్రారంభోత్సవాలు, షూటింగులను నిలివేయాలని తమిళనాడు చలన చిత్ర నిర్మాతల మండలి గతంలో విడుదల చేసిన ప్రకటన ఏకపక్షమని, ఇలాంటివాటికి నడిగర్ సంఘం పూర్తిగా వ్యతిరేకమని ఆ సంఘం అధ్యక్షుడు, సీనియర్ నటుడు నాజర్ స్పష్టం చేశారు. ఇదే విషయంపై ఆయన తాజాగా ఒక ప్రకటన విడుదల చేశారు. 'తమిళనాడు చలనచిత్ర నిర్మాతల మండలి షూటింగులను బంద్ చేయాలంటూ ఇచ్చిన పిలుపు ప్రతి ఒక్కరిలో గందరగోళం నెలకొనేలా చేసింది. ఈ తరహా ఏకపక్ష నిర్ణయం ఒక్క సినీ నిర్మాణ కార్మికులకే కాకుండా, నిర్మాతలకు కూడా హాని చేస్తుంది. ఇలాంటి విషయాల్లో అందరూ కలిసి తీసుకునే నిర్ణయాలు చిత్రపరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ మేలు చేస్తాయి. అంతేకానీ ఏకపక్షంగా, ఇష్టారాజ్యంగా తీసుకునే నిర్ణయాలకు నడిగర్ సంఘం తీవ్ర వ్యతిరేకం. తమిళ చిత్రపరిశ్రమ, సినీ నిర్మాణ కార్మికుల సంఘం ఎంఘటితంగా తీసుకునే ఏ నిర్ణయానికైనా నడిగర్ సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుంది. భవిష్యత్‌లో కూడా తమ సపోర్టు కొనసాగుతుంది' అని పేర్కొన్నారు.



బాలుడి చేతిలో మోసపోయా

● నివేదా పేతురాజ్

తాను ఎనిమిదేళ్ల బాలుడి చేతిలో మోసపోయానని హీరోయిన్ నివేదా పేతురాజ్ వాపోయారు. తన చేతిలో ఉన్న కరెన్సీని బలవంతంగా లాక్కొని పారిపోయాడన్నారు. కోలీవుడ్‌లో యువనటి నివేదా పేతురాజ్ 'ఒరునాల్ కూత్తు', 'పొదువాగ ఎన్‌మనసు', 'టిక్ టిక్ టిక్' వంటి అనేక చిత్రాల్లో నటించిన ఆమె... ఇపుడు నగరంలోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అడయార్ ప్రాంతంలో ఒక బాలుడు చేతిలో మోసపోయినట్టు ఆమె వెల్లడించారు. 'అడయార్ సిగ్నెల్ వద్ద ఎనిమిదేళ్ల బాలుడు డబ్బులు అడిగాడు. ఉచితంగా డబ్బులు ఇచ్చేందుకు నా మనసు అంగీకరించలేదు. దీంతో రూ.50 విలువైన పుస్తకాన్ని కొనాలని చెప్పడంతో రూ.100 నోటు తీయగా, ఆ బాలుడు రూ.500 అడిగాడు. దీంతో పుస్తకాన్ని బాలుడికి తిరిగి ఇచ్చి, నేను ఇచ్చిన రూ.100 నోటు వెనక్కి తీసుకున్నాను. అయితే, ఆ పిల్లవాడు పుస్తకాన్ని కారులో పడేసి... చేతిలోని రూ.వంద నోటు లాక్కొని పారిపోయాడు' అని పేర్కొంది.

చిత్రజ్యోతి


ఎం.ముత్తయ్య

హీరోగా.. మరో దర్శకుడు

కోలీవుడ్ దర్శకుడు ఎం.ముత్తయ్య త్వరలోనే హీరోగా వెండితెరపై కనిపించనున్నట్టు సమాచారం. ఈయన దర్శకత్వంలో వచ్చిన 'కుట్టిపులి', 'కొంబన్', 'మరుదు', 'విరుమన్' వంటి చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. మంచి కథాంశాలను ఎంచుకుని చిత్రాలను ఈయన తెరకెక్కిస్తుంటారు. ఈ క్రమంలో ఆయన చివరగా దర్శకత్వం వహించిన సినిమా 'ఖాదర్ బాషా ఎన్‌గిర ముత్తురామలింగం'. బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. దీంతో ఆయన దర్శకత్వంలో నటించేందుకు ఏ హీరో సాహసం చేయలేదు. ఈ క్రమంలో ఆయన కుమారుడుని హీరోగా పరిచయం చేస్తూ ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆ తర్వాత మరో చిత్రానికి ప్లాన్ చేశారు. ఇందులో ఆయనే ప్రధాన పాత్ర పోషించాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ చిత్రానికి దర్శకత్వం ఎవరు వహిస్తారన్నది మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు.

గురు సోమసుందరం హీరోగా 'బాటిల్ రాధ'



'జోకర్' చిత్రం ద్వారా ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న నటుడు గురు సోమసుందరం. ఆ తర్వాత పలు చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా నటించారు. ఇపుడు మళ్ళీ హీరోగా నటించారు. ఈ చిత్రానికి 'బాటిల్ రాధ' అనే టైటిల్ ఖరారు చేయగా, డిసెంబరు 20న విడుదల కానుంది. ఇందులో హీరోయిన్‌గా సంచనా నటరాజన్ నటించారు. దినకరన్ శివలింగం దర్శకత్వం వహించారు. ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ నిర్మాణ సంస్థ నీలం ప్రొడక్షన్ పతాకంపై తెరకెక్కింది. ఒక తాగుబోతు జీవితంలో చోటుచేసుకునే సంఘటనల సమూహారంతో రూపొందించారు. జూలైలో ఈ సినిమా టీజర్ విడుదలైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రాన్ని వచ్చేనెలలో విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.

ఒకేసారి ప్రయాణం వాహనాలతో నిండిన రోడ్లు

● స్వస్థలాల నుంచి తిరిగొచ్చిన జనం
● కిలాంబాక్కం - తాంబరం మధ్య స్తంభించిన ట్రాఫిక్
● ఉద్యోగులు, విద్యార్థుల అవస్థలు


సోమవారం వేకువజాము పెరుంగళత్తూరు వద్ద ఆగిన వాహనాలు


తాంబరం రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కోసం స్వస్థలాలకు వెళ్లిన వారంతా రాష్ట్రరవాణా సంస్థ, ఆమ్నీ బస్సుల్లో ఆదివారం అర్ధరాత్రి నగరానికి బయలుదేరటంతో కిలాంబాక్కం - తాంబరం మధ్య వాహనాల రాకపోకలు స్తంభించాయి. సోమవారం ఉదయానికల్లా కార్యాలయాలకు వెళ్లాలనుకున్న ఉద్యోగులు, సమయానికి తరగతులకు హాజరుకావాలనుకున్న విద్యార్థులు తాంబరం మార్గంలో ట్రాఫిక్ స్తంభించడంతో ఇబ్బందులకు గురయ్యారు. ఒకే సమయంలో వందల సంఖ్యలో బస్సులు, కార్లు, వ్యాన్లు నగరంవైపు దూసుకురావటంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించలేకపోయారు. తిరునల్వేలి, తూత్తుకుడి, నాగర్‌కోవిల్, కన్నియాకుమారి, తెన్‌కాశి, మదురై, విరుదునగర్ తదితర నగరాలకు చెందినవారంతా పండుగ సెలవులు తరువాత సకాలంలో తమ విధులకు హాజరయ్యేందుకు చెన్నైకి పోటెత్తారు. ఆదివారం మధ్యాహ్నం నుండే రైళ్లు, బస్సుల్లో దూరప్రాంతాల వారంతా నగరానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి బయల్దేరిన వారంతా నగర శివారులోనే సోమవారం ఉదయం ట్రాఫిక్ రద్దీలో చిక్కుకుపోయారు. రెండు రోజుల వ్యవధిలో 3.50 లక్షల మంది తమ స్వస్థలాల నుంచి నగరానికి తిరిగి వచ్చినట్లు రవాణా సంస్థ అధికారులు చెబుతున్నారు. ఇక వండలూరు - తిరుచ్చి రహదారిలో ఆదివారం సాయంత్రం నుండే వాహనాల రద్దీ పెరిగింది. సోమవారం వేకువజాము నుంచి విక్రవాండి, ఉలుందూరుపేట, దిండివనం, చెంగల్పట్టు టోల్‌గేట్ల వద్ద వందల సంఖ్యలో బస్సులు బారులు దీరి పెరంగళత్తూరు వరకు ట్రాఫిక్ స్తంభించింది. విల్లుపురం, పుదుచ్చేరి, తిరువణ్ణామలై, వందవాసి, కళ్లకురిచ్చి, రాణిపేట, ఆరణి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు కూడా సోమవారం ఉదయం కిలాంబాక్కం - తాంబరం రహదారిలో నత్తనడక నడిచాయి. ట్రాఫిక్ పోలీసులు తంటాలు పడి ఉదయం 8 సరికి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. అయితే ఉదయం తొమ్మిది గంటలకు మళ్ళీ వందల సంఖ్యలో బస్సులు, కార్లు రావటంతో ట్రాఫిక్ పోలీసులు దిగ్భ్రాంతి చెందారు. సింగపెరుమాళ్ కోవిల్ రహదారి, తాంబరం - మీనంబాక్కం మధ్య, పెరంగళత్తూరు వద్ద వాహనాల కదల్లేకపోయాయి. మళ్ళీ ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి అష్టకష్టాలు పడి ఉదయం పది గంటలకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

చెన్నై పోర్ట్‌లో కేంద్రమంత్రి పర్యటన

● రూ.187 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం



అడయార్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై పోర్ట్ ట్రస్ట్‌లో రూ.187 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర నౌకాయాన మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రారంభించారు. రెండు రోజుల పర్యటన కోసం కోసం ఆయన నగరానికి వచ్చారు. పర్యటనలో భాగంగా సోమవారం రూ.187 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. వీటిలో చెన్నై పోర్ట్ ట్రస్టులో రూ.78 కోట్లతో పూర్తి చేసిన రెండు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులుండగా, ఎన్నూరు కామరాజర్ పోర్ట్ ట్రస్ట్‌లో రూ.109 కోట్లతో పూర్తి చేసిన వివిధ రకాల ప్రాజెక్టులను ప్రారంభించారు. చెన్నై పోర్ట్ ట్రస్ట్‌లో రూ.73.91 కోట్లతో నిర్మించే నాలుగు ఎగ్జిమ్ గోడౌన్లకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.4 కోట్లతో నిర్మించిన కోస్టల్ రోడ్డును ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఎన్నూరు కామరాజర్ పోర్టులో దక్షిణ రైల్వేతో అనుసంధానం చేసేలా రూ.88.91 కోట్లతో చేపట్టిన డబ్లింగ్ పనులను ప్రారంభించారు. దీనివల్ల ర్యాక్‌ల హ్యాండ్లింగ్ కెపాసిటీ రోజుకు 22 నుంచి 44కు పెరుగుతుంది. షోర్ పవర్ సప్లై ఫెసిలిటీ కోసం రూ.20.51 కోట్లతో నిర్మించిన రెండు కోల్ బెర్త్‌లను ప్రారంభించారు. మంత్రి సర్బానందతో పాటు చెన్నై, ఎన్నూరు పోర్ట్ ట్రస్ట్‌ల చైర్మన్ సునీల్ పాలివాల్, డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎస్.విశ్వనాథన్, కామరాజర్ పోర్ట్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ జేపీ ఇరేనీ సింథియా, రెండు పోర్ట్ ట్రస్ట్‌ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

● డబ్ల్యుటీఎఫ్ కార్యదర్శి శ్రీలక్ష్మి


మొక్కలు నాటే కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులతో శ్రీలక్ష్మి తదితరులు

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న భూతాపాన్ని నివారించే దిశగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యుటీఎఫ్) సెక్రటరీ జనరల్ శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. సమాఖ్య అధ్యక్షురాలు డా.వీఎల్ ఇందిరాదత్ సూచనల మేరకు డబ్ల్యుటీఎఫ్ శాఖలున్న ప్రాంతాల్లో 'ప్రకృతిని ప్రేమిద్దాం...మొక్కలు విరివిరిగా నాటుదాం...పశువులు, పక్షులు.. నీటివనరులను సంరక్షించుకుందాం' అనే నినాదంతో అవగాహనతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రాజధాని నగరంలోని మద్రాసు యూనివర్శిటీ ప్రాంగణంలో కార్తీక సోమవారం సందర్భంగా 200 మొక్కలు నాటారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఏలుమలై ముఖ్యఅతిథిగా హాజరై డబ్ల్యుటీఎఫ్ సేవలను అభినందించారు. అలాగే, నాలుగు రకాలకు చెందిన 200 మొక్కలు నాటిన సందర్భంగా అడవుల పెంపకం సంస్థ ప్రతినిధి హఫీజ్ ఖాన్ ధృవ పత్రాన్ని శ్రీలక్ష్మి మోహనరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సీతామహాలక్ష్మి పెందుర్తి, కోశాధికారి వెంకట్ మాదాల, సంయుక్త కోశాధికారి పి.రుక్మిణిదేవి, సభ్యులు సురేఖ, డీఎల్ఎన్ రెడ్డి, ఊరా శశికళ, ఏవీ శివకుమారి, అరుణా శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వారుపేట మ్యూజిక అకాడమీలో 'ప్రొవోక్ ఆర్ట్ ఫెస్టివల్' రెండో రోజు కూడా ఘనంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు కళారంగంలో నిష్ణాతులైన వారిని సత్కరించి, జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. పద్మభూషణ్ డాక్టర్ డీవీ గోపాలకృష్ణన్, పద్మశ్రీ లీలా శామ్సన్, పద్మశ్రీ ఆర్.ముద్దుకృష్ణమ్మాళ్, కళైమామణి టీఏసీకే మౌళి, గంగై అమరన్ తదితరులకు జీవన సాఫల్య పురస్కారాలను బహూకరించి, సత్కరించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఐజీ సంతోష్, ఆవడి పోలీసు కమిషనర్ శంకర్, ఐటీ కమిషనర్ శివశంకర్ తదితరులు హాజరై, అవార్డు గ్రహీతలను సత్కరించారు.

'ఉద్యోగ ఉత్సవ్'కు విశేష స్పందన



విద్యార్థినులకు సర్టిఫికెట్ల ప్రదానం

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'అవతార్ హ్యూమన్ క్యాపిటల్ ట్రస్టు' (ఏహెచ్‌సీటీ), ఆసాన్ మెమోరియల్ కాలేజీ సంయుక్తంగా నిర్వహించిన 'ఉద్యోగ ఉత్సవ్ 2024'కు విశేష ఆదరణ లభించింది. యువతులకు సాధికారత కల్పించడం, వారి ఆశయాలను దరి చేర్చడమే లక్ష్యంగా జరిగిన ఈ ఉత్సవ్‌లో 500 మందికి పైగా విద్యార్థినులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. దీని గురించి ఏహెచ్‌సీటీ మేనేజింగ్ ట్రస్టీ సౌందర్య రాజేష్ మాట్లాడుతూ.. మహిళా శ్రామికశక్తిని పెంచే దిశగా తాము 25 ఏళ్లుగా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థినులకు నిర్వాహకులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

అలరించిన లక్ష్మణ్ శ్రుతి సంగీత విభావరి



ఆచార్య సీఎంకే రెడ్డి, సినీ గాయకుడు రామును సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్యారీస్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లోని తిరుమురుగన్ ఆలయంలో స్కందషష్ఠి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామివార్లను అలంకరించి సామూహిక పారాయణం నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి లక్ష్మణ్ శృతి బృందానికి చెందిన కళాకారులు ఆలపించిన భక్తిగీతాలు శ్రోతలను అలరించాయి. ప్రముఖ నేపథ్యగాయని మాలతి సారథ్యంలో ఏర్పాటైన సంగీత కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి ప్రారంభించారు. ఆతీయ అతిథిగా పాల్గొన్న సినీ నేపథ్యగాయకుడు రాము, గాయని మాలతి కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. ఆలయ నిర్వాహకులు అతిథులను సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఏఐటీఎఫ్ సెంట్రల్ చెన్నై అధ్యక్షుడు కుంకు దశరథరావు, ట్రిప్లికేన్ నిర్వాహకులు పాల్ కొండయ్య సహా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

భారత్ సంగీత్ ఉత్సవ్ ప్రారంభం



చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వారుపేట నారద గాన సభలో ఇటీవల 'భారత సంగీత్ ఉత్సవ్' ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీ వరకు ఈ ఉత్సవ్ కొనసాగనుంది. కర్ణాటిక పార్థసారథి స్వామి సభ నిర్వహిస్తున్న తొమ్మిది రోజుల ఉత్సవంలో ప్రముఖ తారలు, కళాకారులు, ప్రతిభావంతులు కచేరీ చేయనున్నారు. కాగా పార్థసారథి స్వామి సభ కార్యదర్శి రామమూర్తి, కర్ణాటక వ్యవస్థాపకులు ఎం.కృష్ణమూర్తి, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు శశికిరణ్ సమక్షంలో సంగీత విద్వాంసురాలు నిత్యశ్రీ సంగీతోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఏడాది జరుగుతున్న ఉత్సవాల్లో ప్రముఖ విద్వాంసులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వీఐటీలో వాలీబాల్ పోటీలు ప్రారంభం

వేలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాలీబాల్ సంఘం చైర్మన్, వీఐటీ యూనివర్సిటీ వైస్ చైర్మెన్ డా.జీవీ సెల్వం రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 27 జిల్లాలకు చెందిన 582 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. టోర్నీ ప్రారంభోత్సవంలో రాష్ట్ర వాలీబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి ఏజే మార్టిన్ సుధాకర్, జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షులు డా.ఎస్వీ త్యాగచందన్, ఉపాధ్యక్షులు వి.వినోద్‌కుమార్, కార్యదర్శి కేడీ లక్ష్మణన్, కోశాధికారి టి.దినకరన్ తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న వర్శిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ జీవీ సెల్వం

● రామ్‌రాజ్ సామాజిక సేవ

మురుగన్ ఆలయానికి విద్యుత్ వాహనం విరాళం



ఆలయ నిర్వాహకులకు వాహనం అందిస్తున్న కేఆర్ నాగరాజన్

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వస్త్రరంగంలో పేరొందిన రామ్‌రాజ్ సంస్థ పళని మురుగన్ ఆలయానికి ఎలక్ట్రిక్ వాహనాన్ని విరాళంగా అందించింది. సంస్థ ఛైర్మన్ కేఆర్ నాగరాజన్ ఆలయ ప్రాంగణంలో వాహనాన్ని ఆలయ జాయింట్ కమిషనర్ మారిముత్తుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర భక్తులను రోప్‌కార్ లేదా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఈ వాహనాన్ని వినియోగించుకునేందుకు అనువుగా అందించామన్నారు. భక్తులకు ప్రయాణాన్ని సులభతరం చేసే ఉద్దేశంతో పళని మురుగన్ ఆలయానికి వాహనం అందించడం తమ అదృష్టమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తమ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని వివరించారు.



ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తీశ్వరాలయం శివనామ స్మరణతో మార్మో గింది. కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరిం చుకుని భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వేకువ జాము నుంచే క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 35వేలమంది స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నట్లు అధికా రుల అంచనా.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

తిరునగరిలో భూకైలాస్

● రూపుదిద్దుకుంటున్న మహా నంది-శివలింగ మందిరం
● రూ. 5కోట్ల వ్యయంతో ఎత్తయిన నిర్మాణం
● బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివభక్తులకు కానుక



భవనంపై భాగంలో ప్రతిష్ఠించనున్న నంది, శివ పార్వతుల విగ్రహాలు



రూపుదిద్దుకుంటున్న మూడంతస్తుల శివలింగ మందిరం

తిరుపతి అనగానే రక్కున వేంకటేశ్వర స్వామి గుర్తుకు వస్తారు. పుణ్యక్షేత్రంగా తిరునగరి ఇప్పుడు మరో ఆధ్యాత్మిక కేంద్రం కొలువుదీరనుంది. ప్రముఖ దర్శనీయ స్థలాల సరసన ఇది చోటు సంపాదించుకోనుంది. భక్తులను పరవశుల్ని చేసేలా అపురూప 'నంది-శివ లింగ మందిరం' రూపుదిద్దుకుంటోంది. ఇది దేశంలోనే మూడవదిగా చెబుతున్నారు. రాష్ట్రంలో రెండో ఎత్తయిన శివ లింగ మందిరంగా నిలిచేం... సమాయత్తమవుతోంది. పుట్టపర్తిలో 75 అడుగుల ఎత్తులో ఇదే నమూనాతో శివ లింగ మందిరం ఉంది. బ్రహ్మకుమారీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి శివారు మంగళం క్వార్టర్స్ సమీపాన నంది-శివలింగ మందిర నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పదెకరాల విస్తీర్ణంలో బ్రహ్మకుమారీల ఆశ్రమంలోనే ఈ మందిరం ఏర్పాటు కానుంది. 1.25ఎకరాల విస్తీర్ణంలో ప్రశాంత, ఆహ్లాదరకర వాతావరణంలో దాదాపు రూ.5కోట్ల వ్యయంతో మూడంతస్తుల మందిర నిర్మాణాన్ని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గతేడాది అక్టోబరులో పనులు మొదలవగా.. ఇప్పటికి సగం పనులు పూర్తయ్యాయి. భక్తులను ఆకట్టుకునేలా మందిరాన్ని నిర్మించేందుకు 50 మంది శిల్పులు నిత్యం శ్రమిస్తున్నారు.

శివలింగమందిర విశేషాలు

భూమట్టం నుంచి 67అడుగుల ఎత్తు, 67అడుగుల వెడల్పు చుట్టుకొలత మధ్య మూడు అంతస్తుల్లో శివలింగమందిరాన్ని నిర్మిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలు ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో వేంకటేశ్వర స్వామి నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. మొదటి అంతస్తులో రాజయోగ అభ్యాసనం వీడియో షో ప్రదర్శించనున్నారు. ధ్యానం చేసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా లిఫ్ట్ సౌకర్యం కల్పించనున్నారు. మెట్ల సదుపాయం కూడా ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

సిద్ధమవుతున్న భారీ నంది

శివలింగం ముందుభాగాన శివనామాలు, మూడోనేత్రానికి సమాన ఎత్తులో మరో నిర్మాణం చేపట్టారు. దాదాపు 60అడుగుల ఎత్తులో భారీ నంది ఏర్పాటు కానుంది. శివుని మూడో నేత్రం, నంది నయనాలు సమాన కొలతతో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 24అడుగుల పొడవు, 16అడుగుల ఎత్తుతో భారీ నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సరికొత్త ఆలోచనలే పెట్టుబడి

● 'అగ్రి'లో అంకుర సంస్థలకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెటర్నరీ వీసీ జేవీ రమణ, ఏడీ రమణ తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలలో సరికొత్త ఆలోచనలు కలిగి అంకుర సంస్థలు ఏర్పాటు చేయదలచిన ఔత్సాహికుల నుంచి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని ఆంగ్రు పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రం ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మూడు స్కీమ్‌ల ద్వారా ఈ దరఖాస్తులను కోరుతున్నారు. వినూత్న ఆలోచన వరకే పరిమితమైన వారికి యోచ్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు, ప్రోటోటైప్ నమూనా ఉన్న వారికి అగ్రి ఇన్నో ద్వారా రూ.25లక్షల వరకు ఫండింగ్ అందించనున్నారు. ఈ ఏడాది కొత్తగా మెరిస్టమ్స్ స్కీమ్ ప్రవేశపెట్టారు. ఇందులో నూతన ఆలోచనలతో వ్యవసాయ అంకుర సంస్థలు నెలకొల్పేందుకు ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులకు(కోర్సు పూర్తి) రూ.4లక్షల వరకు ఐడియా ఫండింగ్ అందిస్తారు. ఈ పథకాల ద్వారా ఎంపికైన వారికి శిక్షణతో పాటు ఫండింగ్ ద్వారా అంకుర సంస్థల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తారు. వచ్చేనెల 4వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఇతర వివరాల కోసం 'ఏఎన్‌జీఆర్‌ఏయూఆర్‌ఏబీఐటీపీటీ.ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంది. ఈ కేంద్రం ద్వారా నిర్వహించే 8వ బ్యాచ్‌కి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ రమణతో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి కలసి విడుదల చేశారు. ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కదిరి మోహన్, కోప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ ప్రారంభం

తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని ఆంగ్రు పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రంలో సోమవారం 7వ బ్యాచ్ శిక్షణ ప్రారంభించారు. వ్యవసాయ, వెటర్నరీ రంగాలను అనుసంధానిస్తూ కొత్త ఆలోచనలను ప్రోత్సహించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి సూచించారు. వ్యవసాయ ఇంజినీరింగ్‌లో వస్తున్న ఆవిష్కరణలను వివరించారు.

చెంచయ్య మృతదేహానికి రీ పోస్టుమార్టం



పటిష్ట పోలీసుల భద్రత నడుమ పోస్టుమార్టం చేస్తున్న వైద్య బృందం

పెళ్లకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాలెం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున గత నెల 23న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బండి చెంచయ్య మృతదేహానికి సోమవారం రీ పోస్టుమార్టం జరిగింది. వడ్డిపాలేనికి చెందిన చెంచయ్య గత నెల 23న మృతి చెందగా 24న నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. నాయుడుపేటలో జరిగిన పోస్టుమార్టంపై తమకు నమ్మకం లేదని, మరోసారి పోస్టుమార్టం చేసి న్యాయం చేయాలని మృతుడి భార్య ప్రమీలమ్మ హైకోర్టును ఆశ్రయించారు. గత నెల 29న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు.. సోమవారం రీపోస్టుమార్టం నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో తిరుపతి స్విమ్స్ వైద్యులు గ్రామానికి చేరుకుని బంధువులు, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి మళ్లీ పోస్టుమార్టం చేశారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు, ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల నియామకాల సమగ్ర సమాచారమివ్వండి

తిరుపతిరూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో 2008 ఏప్రిల్1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉద్యోగుల నియామకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని ఏపీ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్)కార్యాలయ సీనియర్ ఆడిట్ అధికారి గత నెల 29న జారీ చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగుచూసింది. వర్సిటీలో సూపరింటెండెంట్‌గా పనిచేసే జి.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.రాజేష్‌రెడ్డిలకు సంబంధించిన సర్వీస్ రికార్డ్స్‌తో పాటు వీరిద్దరిపై ఏమైనా కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయా..? అలా ఉంటే ఫైల్‌తోపాటు కేసుల స్థితివంటి సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించారు. అలాగే వర్సిటీ నిధుల్లో చేసిన డబుల్ పేమెంట్స్, దీనికి సంబంధించి న్యాయపరమైన సమస్యలు, పునరుద్ధరణ వంటి వివరాలు, మెడికల్ ఇన్వాలిడేషన్ పద్ధతిలో చేపట్టిన కంపాజినేట్(కారుణ్య) నియామకాల సమాచారాన్ని అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే అంతకు ముందు ఆంగ్రువర్సిటీలో వెటర్నరీ అంతర్భాగంగా ఉన్నప్పుడు చేపట్టిన మెడికల్ ఇన్వాలిడేషన్ నియామకాలపై కోర్టులో కేసు నడుస్తుందని, వీటిపై కూడా విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయని పలువురు ఉద్యోగులు అంటున్నారు. ఏజీ కార్యాలయం నుంచి సమాచారం అడగడంతో పలువురు ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్న చర్చ వర్సిటీలో నడుస్తోంది.

అది పట్టా భూమే

● అర్బన్ తహసీల్దారు వెల్లడి

తిరుపతి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి):తిరుపతి రూరల్ మండలం మంగళం గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 114లో ప్రభుత్వ భూమి కబ్జా అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి స్పందించారు. రెవెన్యూ అధికారులను తనిఖీకి పంపామని,షెడ్లు నిర్మించిన స్థలం ప్రైవేట్ వ్యక్తులదని చెప్పారు. అయితే ఆ స్థలంలోకి వెళ్లేందుకు కాలువను దారిగా మార్చుకున్నట్టు ప్రాథమిక సర్వేలో గుర్తించామన్నారు.ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకుని చేశారా లేదా తెలుసుకునేందుకు మంగళవారం మరోసారి ఇరిగేషన్, రెవెన్యూఅధికారులతో సంయుక్తంగాకాలువ ఆక్రమణ అంశంపై విచారణ జరుపుతామన్నారు.

రోజావి నిరాధార ఆరోపణలు

● ఆమెను అరెస్టు చేయాలంటూ తెలుగు మహిళల ఫిర్యాదు



రోజాపై ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న తెలుగు మహిళలు

పుత్తూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసిన మాజీ మంత్రి రోజాను వెంటనే అరెస్టు చేయాలని తెలుగు మహిళలు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం పుత్తూరు ఎస్ఐ ఓబయ్యకు ఫిర్యాదు చేశారు. 'టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు ఆడపిల్లల్ని రేప్ చేస్తుంటే, తగలబెడుతుంటే, ముక్కలు ముక్కలుగా నరికేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత కేసులు పెట్టడం లేదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏమి చేస్తున్నాడు' అంటూ రోజా నిరాధార ఆరోపణలు చేశారని చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న తప్పుపట్టారు. మూడున్నరేళ్ల చిన్నారి అఘాయిత్యానికి గురై.. తల్లిదండ్రులు గర్భశోకంలో ఉంటే మంత్రి రోజా ఆస్పత్రి వద్ద రాజకీయాలు మాట్లాడటం దారుణమన్నారు. గత ప్రభుత్వ గంజాయి మూలాలతోనే ఇప్పుడు జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు టీడీపీ ప్రధాన కార్యదర్శి ధనపాల్, తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బసంతి, కౌన్సిలర్ భువనేశ్వరి, భారతి, నాగరత్న, రజినీ, మోహన తదితరులు పాల్గొన్నారు.



సైబర్ క్రైం అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ

డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తగా ఉండాలి : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ప్రపంచంలో ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలని, సమాజాన్ని సురక్షితంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. పద్మావతి మహిళా వర్సిటీ ఆడిటోరియంలో సోమవారం సైబర్ క్రైం వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దైనందిన జీవితంలో ఇంటర్నెట్, స్మార్ట్ మొబైల్, కంప్యూటర్ భాగమైపోయాయని, దీన్ని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు సులభంగా బురిడీ కొట్టిస్తున్నారన్నారు. దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని తోటి వారిని చైతన్యపరచి సైబర్ నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. యువత, ఉద్యోగులు, మహిళలు, ఐటీ నిపుణులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వీసీ ఉమ కోరారు. అవసరం లేని యాప్‌ల పట్ల జాగ్రత్త వహించాలని సైబర్ క్రైం నిపుణుడు ఐఎల్ నరసింహారావు సూచించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని, డీఎస్పీలు వెంకటనారాయణ, శ్రీలత, మహిళా విశ్వవిద్యాలయం ఆచార్యులు, పోలీసు అధికారులు, సైబర్ క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

వినతులకు సకాలంలో పరిష్కారం చూపండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం ● పీజీఆర్ఎస్‌కు 181 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించాలని, పరిష్కారం కాని సమస్యలు ఎందుకు అనేది వివరణాత్మకంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 181 అర్జీలు అందగా రెవెన్యూ శాఖవే 119 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్డీసీ దేవేంద్రరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

అగ్రికల్చర్ కళాశాల, హార్టికల్చర్ పరిశోధన కేంద్రం, వెటర్నరీ వర్సిటీలోని కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి జయచంద్ర డిమాండు చేశారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా 2012 చట్టం ప్రకారమే జీతాలు అందిస్తున్నారన్నారు. ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, మునిరాజా, అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ యూనియన్ నాగరత్నమ్మ, మస్తాన్, పరశురామ్ పాల్గొన్నారు.

అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోండి

ఇటీవల కాలంలో పెరిగిపోతున్న అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మద్యం, డ్రగ్స్ కారణంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. వడమాలపేట మండలంలో చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

తమ గ్రామంలో మేత పొరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారని ఓజిలి మండలం, మనవాలి గ్రామానికి చెందిన చిన్నపుల్లయ్య ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల సహకారంతో తప్పుడు రికార్డులు సృష్టించి, ఆక్రమించుకున్నారని తెలిపారు. రీసర్వేలోనూఅవకతవకలు జరిగాయని, 2.93సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమార్కులు తమ పేరుతో బదలాయించుకున్నారని వివరించారు. దీనిపై విచారణ జరపాలని విన్నవించారు.

ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీ యునైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కుమార్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు మునేంద్ర మాట్లాడుతూ గ్రామీణుల ఆరోగ్య విషయంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తారని, అలాంటి వారికి రూ.10వేలు గౌరవ వేతనం ఇచ్చి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని అన్నారు. జీతాలు పెంచి, పనిఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జహీరా, జిల్లా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రసూతి సెలవులు 3 నెలలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లు పద్మావతి, లక్ష్మమ్మ, సుందరమ్మ, శారద, అమరావతి, సుగుణ, మంగమ్మ, సరిత పాల్గొన్నారు.



బాధితుడు సుబ్బన్న

మీ సర్వేయరే నా స్థలం కబ్జా చేశాడు

● గ్రీవెన్స్‌లో ఆర్డీవో వద్ద బాధితుడి ఆవేదన

తిరుపతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మీ దగ్గర పనిచేసే సర్వేయరే నా స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టేసుకున్నాడు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా న్యాయం జరగడంలేదు. మీరైనా సర్వే చేయించి న్యాయం చేయండి' అంటూ ఆర్డీవో రామ్మోహన్ ముందు ఓ బాధితుడు ఆవేదన చెందారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో రూరల్ మండలం అవిలాల గ్రామానికి చెందిన వి.సుబ్బన్న వినతి పత్రం అందజేశారు. డాక్యుమెంట్లు పరిశీలించిన ఆర్డీవో ఇప్పటి ఈసీ తీసుకొస్తే జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్‌తో సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా బాధితుడు సుబ్బన్న 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 28/3లో 10 సెంట్లు, 28/4లో 0.39 సెంట్లు, 28/2లో 27 సెంట్లు స్థలం అనువంశికంగా మా స్వయార్జితం. 28/3లో చిట్టిబాబు అనే సర్వేయర్‌కు 30 అంకణాల భాగం విక్రయించాను. ఆ స్థలాన్ని వేరేవాళ్లకు విక్రయించేసి, 28/4లో నేను నిలుపుకొన్న స్థలాన్ని ఆక్రమించి 40 అంకణాలకు పైగా ఇల్లు నిర్మించుకున్నాడు. సదరు స్థలాలను సర్వే చేయడానికి రూరల్ తహసీల్దారును పలుసార్లు కోరినా సర్వేయర్లు ముందుకు రావడంలేదు. సర్వే నివేదిక ఇవ్వడంలేదు. అతడు సర్వేయర్ కావడంతో ఇతర సర్వేయర్లు నాకు సహకరించడంలేదు. గత వారం గ్రీవెన్స్‌కి వచ్చినప్పుడు తనపై దాడి చేస్తున్నానని నాపై సర్వేయర్ చిట్టిబాబు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆర్డీవోను కలవనీయకుండా చేశారు. జిల్లా సర్వేయర్ ద్వారా 28/3, 28/4 నెంబర్లకు సర్వే జరిపి మాకు హద్దులు చూపించాలని కోరుతున్నా' అని విజ్ఞప్తి చేశారు. దీనిపై చిట్టిబాబును వివరణ కోరగా తాను కొనుగోలు చేసిన స్థలంలోనే ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు.